క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై వారం రోజులగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఖాళీ సమయంలో పండ్లు, కూరగాయలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణనిచ్చామన్నారు. ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని, స్వయం సమృద్ధిని సాధించాలని సూచించారు. గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మోగులూరు(కంచికచర్ల): మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన షేక్ ఆరిఫ్ కుమార్తె ఫౌజియా చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10లక్షల విలువగల చెక్కును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 17 నెలల చిన్నారి ఫౌజియా ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రభుత్వం ఆర్థికసహాయం అందజేసిందని ఎమ్మెల్యే సౌమ్య వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు):ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని ముచ్చింతాల గ్రామానికి చెందిన మహిళలు బుధవారం పెద్ద సంఖ్యలో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారికి సారె సమర్పించి బోనాలు చెల్లించారు. వీరికి ఆలయం అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు. సారె తెచ్చిన మహిళలకు ఆలయ వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. మహిళలు ముచ్చింతాల గ్రామం రామాలయం వద్ద నుంచి భాజాభజంత్రీలు,మంగళ వాయిద్యాలతో ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చి సారెను సమర్పించారు.

ముగిసిన చండీ హోమాలు

జగ్గయ్యపేట: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల రాజరాజేశ్వరీ పీఠంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న చండీ హోమాలు, రుద్ర పారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. లోకకళ్యాణార్థం రాజరాజేశ్వరీ అమ్మవారికి కార్యక్రమాలు నిర్వహించినట్లు పీఠం నిర్వాహకులు బాచినపు కోటేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ



తిరుమలగిరి(జగ్గయ్యపేట):పాఠశాల అభివృద్ధికి దాతలతోపాటు ఉపాధ్యాయులు కూడా తమ వంతుగా సహకరించాలని ఎంఈవో-2 చిట్టిబాబు కోరారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చాముండేశ్వరి వితరణతో బుధవారం పాఠశాలకు ప్రింటర్‌ను ఎంఈవో చేతుల మీదుగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాదబాబు, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో రైతులకు ఎంతో లాభం



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు):రైతులు విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా ఎన్నో లాభాలు పొందుతారని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి సత్యవతి పేర్కొన్నారు. మండలంలోని గుమ్మడిదుర్రులో విత్తన ఉత్పత్తి పథకం, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధితో ఫంగస్, వైరస్, ఇతర తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. వరి పంటలను పరిశీలించి నారుమడుల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులు, ప్రధాన పొలంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. విత్తనానికి ఉండాల్సిన ప్రమాణాలు, జన్యు స్వచ్ఛత ఆధారంగా విత్తనాల నాణ్యత, విత్తన తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈ కె.రామసుబ్బారెడ్డి, గ్రామ వనరుల అధికారి గోపాలరావు, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, హాజరైన కౌన్సిలర్లు

జగ్గయ్యపేట అర్బన్: పనిచేయకుండా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి బయటకు వెళ్లిపోయే మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఇకనైనా పనితీరు మార్చుకోకుంటే వారిపై డీఎంఏ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈసందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ అలేఖ్య మాట్లాడుతూ తనవార్డులో మూడునెలలుగా డ్రైనేజీ పనులు ప్రారంభించలేదని సమావేశం దృష్టికి తీసుకుతెచ్చారు. దీంతో చైర్మన్ రాఘవేంద్ర మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కాగానే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. ఫిబ్రవరిలో వేసిన టెండర్లకు సంబంధించిన కవర్లు నేటివరకు ఓపెన్ చేయలేదంటే ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతోందని మండిపడ్డారు. ఈ విషయంపై కంట్రాక్టర్లతో ప్రత్యేక మీటింగ్ పెట్టాలని డీఈఈని ఆదేశించారు. ఐదునెలలుగా టెండర్ కవర్లు ఓపెన్ చేయకపోవడానికి కారకులైనవారిని కమిషనర్ గుర్తించి వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. స్టాఫ్ మూమెంట్ రిజిస్టర్ ఎందుకు మెయిన్‌టెయిన్ చేయడం లేదని మేనేజర్‌ను ప్రశ్నించారు. మేనేజర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కమిషనర్‌ను నిలదీశారు. పనిచేయని వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారిని వెంటనే డీఎంఏకు సరెండర్ చేయాలని కమిషనర్ నాగమల్లేశ్వరరావుకు సూచించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై అవినీతి ఆరోపణలు..

ఐదోవార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ నిర్వాకం కారణంగానే జగ్గయ్యపేట పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందన్నారు. ఫాగింగ్ మిషన్లు రెండు పనిచేస్తుండగా, ఆరు పనిచేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తూ పెట్రోలు బిల్లులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. పారిశుద్ధ్య వస్తువులు, బ్లీచింగ్, సున్నం, దోమల మందు రసాయనాలు తదితర మెటీరియల్ కొనుగోళ్లలో కూడా అవినీతికి పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చైర్మన్ రాఘవేంద్ర స్పందిస్తూ వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్‌పై విచారణ చేపట్టాలని ఆదేశించారు. అతనిని డీఎంఏకు సరెండర్ చేసి, ఆస్థానంలో మరో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియమితులయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

కుళాయి నీరు కలుషితమవుతోంది..

26వవార్డు కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ మాట్లాడుతూ తమ వార్డులో మున్సిపల్ కుళాయిల్లో పురుగులు వస్తున్నాయని తెలిపారు. ఈ కలుషితమైన నీరు తాగుతూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని సమావేశం దృష్టికి తీసుకురాగా, వెంటనే సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ ఆదేశించారు. కృష్ణా జలాల కోసం గతంలోనే ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మంజూరు చేయించినప్పటికీ వాటిని నూటికి నూరుశాతం అందించేలా కృషిచేయడంలో కౌన్సిల్ పూర్తిగా విఫలమైందని టీడీపీ ఫ్లోర్ లీడర్ కన్నెబోయిన రామలక్ష్మి పేర్కొన్నారు. కృష్ణాజలాలు పట్టణ ప్రజలందరికీ అందాలంటే వెంటనే పైపులైన్ వ్యవస్థను మార్చాల్సి ఉంటుందని, ఆదిశగా ఎమ్మెల్యే కృషిచేస్తే కౌన్సిల్ తరఫున ఆయనకు అభినందనలు తెలియజేస్తామని ఐదోవార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ పేర్కొన్నారు. అన్నా క్యాంటీన్ నిర్వహణకు ఏ నిధులు కేటాయిస్తున్నారని 8వవార్డు కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ప్రశ్నించగా, రైతుబజారు వద్ద బడ్డీని తొలగించాలని పదోవార్డు కౌన్సిలర్ రామలక్ష్మి కోరారు. పాత మున్సిపల్ కార్యాలయం గోడను పగులగొట్టి పెట్టిన బడ్డీని తొలగించాలని నూకల సాంబ, అక్రమ లేఅవుట్లు తొలగించాలని కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, ఎర్రకాలువలో ఆస్పత్రుల వ్యర్థాలు వేయకుండా చూడాలని కౌన్సిలర్ పందుల రోశయ్య కోరారు. అజెండాలో తప్పులు ఉంటున్నాయని కౌన్సిలర్ కొలగాని రాము తెలుపగా, దోమల నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా కోరారు. కుక్కలు, ఆవుల సమస్యను కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు సమావేశం దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏజెండాలోని 35 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



వెంకటకృష్ణ భార్య అనూరాధకు నగదు జమ పత్రాలను అందిస్తున్న ఎంపీపీ రమాదేవి, నాయకులు

లింగాల(వత్సవాయి): ఈ ఏడాది ఫిబ్రవరిలో జగ్గయ్యపేట వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లింగాల గ్రామ సచివాలయ కన్వీనర్ అంబోజీ వెంకటకృష్ణ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచి రూ.5లక్షలను ఆర్థికసాయంగా అందించింది. సచివాలయ కన్వీనర్లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భీమా సదుపాయం కల్పించగా, మృతుడు వెంకటకృష్ణ కుటుంబాన్ని ఆదుకునేందుకు కోరుతూ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వెంకటకృష్ణ మరణ ధృవీకరణపత్రంతోపాటు అవసరమైన అన్ని పత్రాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి సమర్పించారు. దీంతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నేరుగా మృతుడు వెంకటకృష్ణ భార్య అనూరాధ బ్యాంకు ఖాతాలో రూ.5లక్షలు జమమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, మండల మాజీ సచివాలయాల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి గాదెల రామారావు, ఎస్సీసెల్ నాయకుడు యేశపోగు శ్రీనివాసరావు, గ్రామ పార్టీ నాయకుడు కనకచందరరావు తదితరులు బుధవారం లింగాల గ్రామం వెళ్లి మృతుడు వెంకటకృష్ణ భార్య అనూరాధను కలిసి వివరాలు తెలియజేశారు. బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిన పత్రాలను ఆమెకు అందజేశారు. ఈసందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉదయభానులకు వెంకటకృష్ణ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామస్థాయి సమస్యలను గుర్తించాలని ఆదేశం

పోచంపల్లి(జగ్గయ్యపేట): గ్రామస్థాయి అధికారులు ఆయా గ్రామాలలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన పోచంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగనవాడీ కేంద్రం, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలోని సమస్యలను అధికారులు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రైనేజీలు, తాగునీటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో వైద్యసిబ్బంది ప్రజలకు ఆయా వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, ఎంపీడీవో రమేష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సీడీపీవో లక్ష్మీభార్గవి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రావణ్, ఏపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను నాణ్యమైన భోజనం వడ్డించాలి

కంచికచర్ల : మధ్యాహ్న పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించగలమని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారిణి రజినీకుమారి అన్నారు. మండలంలోని పేరకలపాడు గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. భోజనాన్ని రుచిచూసి ఆహార నాణ్యతను అంచనా వేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. మండలంలోని 26 ఓవర్‌హెడ్ ట్యాంకులను రెండునెలలకు ఒకసారి శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.సాత్విక, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ఏపీఎం కోట భాస్కరరావు, హౌసింగ్ ఏఈ సాయిబాబు, ఎంఈఓ బి బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, ఉపాధిహామీ పథకం ఏపీఓ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరీమా, హెచ్‌ఎం కే నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, అంగనవాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకుల దోపిడీ

కంచికచర్ల : రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక పంపిణీ విధానం ఆచరణ అమలులో పూర్తి వైఫల్యం చెందిందని కంచికచర్ల జెడ్పీటీసీసభ్యులు వేల్పుల ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రశాంతి మాట్లాడుతూ కీసర ఇసుక స్టాక్ పాయింట్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు టీడీపీ ముసుగులో ఉన్న మీడియా ప్రతినిధులు తిష్టవేసి సొంతంగా లారీలు, ట్రాక్టర్లు సమకూర్చుకుని యథేచ్ఛగా ఇసుక దందా కొనసాగిస్తున్నారని విమర్శించారు. విజయవాడ ఎంపీ అనుచరుడిగా చెప్పుకుంటున్న ఆర్ఎస్‌బాబు అనే వ్యక్తి పలుమార్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము కూడా చెల్లించకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఒకే రశీదుపై రెండుమూడు ట్రిప్‌ల ఇసుక తరలిస్తున్నారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుక కోసం వచ్చేవారిపై స్థానిక టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల రమేష్ ఆరోపించారు. రెండురోజుల కిందట స్టాక్ పాయింట్ వద్ద జరిగిన గొడవలో సర్దిచెప్పేందుకు తాను వెళ్లితే..తన అన్న, మేనల్లుడిపై టీడీపీ నాయకులు దాడి చేశారని వివరించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు తంగెళ్లమూడి రామారావు, కందుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉద్యోగులు మంచిపేరు తెచ్చుకోవాలి

నందిగామ టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో కరిముల్లా ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఎంపీడీవో విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏవో కరిముల్లా కృషి ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో కరిముల్లా చొరవ మరువలేనిదని కొనియాడారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మనసులు గెలుచుకునేలా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం కరిముల్లా దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

నందిగామ టౌన్: గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ, నందిగామ మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని రాఘవాపురంలోని పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరుపక్కలా దర్శనమిస్తున్న చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అంగనవాడీ కేంద్రాలలోని చిన్నారులకు ప్రభుత్వ మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. సర్పంచి పెసరమల్లి సురేష్, సీడీపీవో భాగ్యరేణుక, సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, కార్యదర్శి రాంజీ పాల్గొన్నారు.

వీఆర్వోలతో సమీక్ష

జుజ్జూరు(వీరులపాడు):గ్రామ రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రాజకిషోర్ ఆదేశించారు. జుజ్జూరులోని మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని రైతులకు సంబంధించి రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

15న అన్నా క్యాంటీన్ ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న అన్నా క్యాంటిన్ వ్యవస్థకు సంబంధించి జగ్గయ్యపేట పట్టణంలోని సీతారామపురంలో ఏర్పాటుచేసిన అన్నా క్యాంటిన్‌ను ఆగస్టు 15వ తేదీన ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నా క్యాంటిన్‌ను ప్రారంభిస్తారని వివరించారు. అదేరోజున చెరువు బజారులో రూ.45 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

200 గ్రాముల గంజాయి స్వాధీనం



తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట):గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో ఒరిస్సాకు చెందిన సంతోష్ కానాసమ అనేవ్యక్తి అద్దెకు ఉంటూ సమీపంలోని ఆటోనగర్‌లోని కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా గంజాయి తీసుకువచ్చి ఈ ప్రాంతంలోని వారికి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ వివరించారు.

నేడు పింఛన్ల పంపిణీ

జగ్గయ్యపేట/వీరులపాడు: సామాజిక పింఛన్ లబ్ధిదారులందరికీ గురువారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు జగ్గయ్యపేట, వీరులపాడు ఎంపీడీవోలు రమేష్‌బాబు, శివపార్వతి తెలిపారు. పింఛన్‌దారులందరికీ వారి ఇళ్లవద్దనే పింఛన్ నగదును అందజేయనున్నట్లు వారు వివరించారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి

ఎంపీపీ కొలుసు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

వత్సవాయి : గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపీపీ కొలుసు రమాదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వత్సవాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఆయాశాఖల అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. అనంతరం ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది సైడ్‌కాలువల్లో మురుగు తొలగించడంతో పాటు మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. బావులు, బోర్లలో బ్లీచింగ్ చల్లించాలన్నారు. భీమవరం రహదారి అధ్వాన్నంగా ఉందని వెంటనే దానికి మరమ్మతులు చేపట్టాలన్నారు. లింగాల కాజ్‌వే ప్రమాదకరంగా మారిందని, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎన్ఆర్ఈజీఎస్‌లో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లను పనిగట్టుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. సర్పంచ్‌లు అంగీకారం లేకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తీర్మానం లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు జరగదని స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొలికపుడి వెంకటేశ్వర్లు, సూపరింటెంటెంట్ మాధవశర్మ, డీటీ రవికుమార్, ఎంఈవో నాగరాజు, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్, ఎంపీటీసీలు, సర్పంచులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లో తనిఖీలు



జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరప్పాడుతండ, జయంతిపురం గ్రామాల్లోని రామ్‌కో సిమెంట్స్, ఆర్‌కె మెడీస్ ఫార్మా కంపెనీలను బుధవారం ఇండస్ట్రియల్ ఫ్యాక్టరీస్‌తో పాటు పలు శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి రాజు ఆధ్వర్యంలో పొల్యూషన్, ఫైర్, లేబర్, బాయిలర్ తదితర శాఖల అధికారులు ఆయా ఫ్యాక్టరీలను తనిఖీ చేసి పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్యాక్టరీలను తనిఖీ చేస్తున్నట్లు అధికారులు ఆశారాణి, సాంబయ్య, శ్రీనివాస్, శ్రీనివాసరావు తెలిపారు

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధుల కట్టడికి జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక డ్రైవ్‌లో పది రోజులపాటు నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత


కొణకంచి క్రాస్ రోడ్స్(పెనుగంచిప్రోలు): మండల పరిధిలోని కొణకంచి క్రాస్ రోడ్స్ వద్ద బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. నందిగామ మండలం అనాసాగరం నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. లారీడ్రైవర్ రామిశెట్టి కృష్ణ, లారీ యజమాని తాటి గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



గెంటెల వెంకటరమణకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావనతో మెలగాలని బలుసుపాడు గురుధాం తాత్వికుడు గెంటేల వెంకట రమణ పేర్కొన్నారు. గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో మెలగడం ద్వారా ప్రశాంతతను పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఈవో హేమలతాదేవి, గురుధాం సభ్యులు పాల్గొన్నారు.



మునేరుకు వరద నీరు



పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద వరద నీరు

పెనుగంచిప్రోలు: ఎగువన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలు కురవడంతో బుధవారం మునేరుకు వరద నీరు చేరింది. ఇప్పటికే మునేరు ఆయకట్టున వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో వందల ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. వరద నీరు కూడా రావడంతో రైతులు వరినాట్లను మరింత వేగవంతం చేశారు.

లింగాల కాజ్‌వే వద్ద అప్రమత్తం...

లింగాల(వత్సవాయి) : మునేటికి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో మునేటికి వరదనీరు పోటెత్తింది. బుధవారం ఉదయానికి పోలంపల్లి డ్యాం వద్ద 9 అడుగుల మేర వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ ఆర్.నరసింహరావు తెలిపారు. మొత్తం 7946 క్యూసెక్కులు మేర వరదనీరు వస్తున్నట్లు చెప్పారు. వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, పోలీస్ అధికారులు లింగాల కాజ్‌వే వద్ద సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఏఎస్ఐ దుర్గారావుకు సత్కారం

కంచికచర్ల : కంచికచర్ల ఏఎస్ఐగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన దుర్గారావును విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఘనంగా సత్కరించారు. సీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ 35ఏళ్లపాటు పోలీస్‌శాఖలో అంకితభావంతో పనిచేశారంటూ దుర్గారావు సేవలను కొనియాడారు. అనంతరం దుర్గారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన సహోద్యోగులు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

